సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం, 14, అక్టోబర్, 2023



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి. మార్కెట్‌కు 52 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరి రూ.6.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.5°/21.7°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

16 నుంచి ఈవీఎంల తనిఖీ



ఈవీఎంలపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల తొలిదశ పరిశీలన ఈ నెల 16 నుంచి జరుగుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఈ ప్రక్రియ 20 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఆరు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ధర్మవరం మార్కెట్ యార్డులో ఈనెల 16 నుంచి ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ కార్యక్రమం నిర్వహిస్తారని, ఇందుకోసం జిల్లాలోని రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, పంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లకు విధులు కేటాయించామన్నారు. వారందరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డీఆర్‌ఓకు సూచించారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఈవీఎంల తనిఖీతో పాటు సిబ్బంది శిక్షణ ఉంటుందన్నారు. ఇందుకోసం 24 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయా టేబుల్‌లో ఒక డీటీ, పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్ ఉండాలన్నారు. 'బెల్' కంపెనీకి చెందిన 12 మంది ఇంజనీర్లు శిక్షణలో పాల్గొని సందేహాలు నివృత్తి చేస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, ఆర్డీఓలు తిప్పేనాయక్, భాగ్యరేఖ, రాఘవేంద్ర, తహసీల్దార్లు నవీన్‌కుమార్, యోగేశ్వరీదేవి, ముర్షావలి, సురేష్‌కుమార్, సునీత, స్వర్ణలత, డీటీలు నరసింహులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ భాస్కర్ తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో రహీం ప్రతిభ


- 'అనిమల్ రిపెల్లంట్' ప్రాజెక్టుకు కేంద్రమంత్రి ప్రశంస



విద్యార్థి రహీం, ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి రహీం జాతీయ స్థాయిలో సత్తా చాటారు. గత ఏడాది పాఠశాలలో పదో తరగతి చదివిన రహీం 'ఇన్‌స్పైర్ మానక్'లో భాగంగా గైడ్ ఎస్.గిరిధర్‌ప్రసాద్ సహకారంతో అనిమల్ రిపెల్లంట్ ప్రాజెక్టు తయారు చేశాడు. ఈ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపిక కాగా, గురువారం న్యూఢిల్లీలో కేంద్ర సైన్సు అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్రసింగ్ నుంచి రహీం ప్రశంసా పత్రంతో పాటు జ్ఞాపికను అందుకున్నారు. 'ఇన్‌స్పైర్ మానక్' ప్రాజెక్ట్‌లో భాగంగా వివిధ రాష్ట్రాల నుంచి 430 ప్రదర్శనలు రాగా, అందులో మన రాష్ట్రం నుంచి 4 ప్రాజెక్ట్‌లు ఎంపికయ్యాయి. అందులోనూ పులమతి పాఠశాల విద్యార్థి రహీం రూపొందించిన ప్రాజెక్ట్ ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థి రహీంను, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు ఎస్.గిరిధర్‌ప్రసాద్‌ను గ్రామ సర్పంచ్ అశ్వత్తనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ మంజునాథ్, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ రామాంజనేయులు తదితరులు సన్మానించి ఊరేగించారు.

మనసుకు మానని గాయం



ఆందోళన.. భయం.. ప్రజలను బెంబేలెత్తిస్తోంది. వీటికి తోడు సామాజిక మాధ్యమాల వినియోగమూ దుష్ప్రభావాలను చూపుతోంది. చదువు, ఉద్యోగాల్లో ఒత్తిడే కాదు మత్తుపదార్థాల వాడకం, ఒంటరి తనం వంటి వాటితో చాలామంది మానసిక జబ్బులకు గురవుతున్నారు.

- పల్లెలకూ విస్తరించిన మానసిక రుగ్మతలు
- పీహెచ్‌సీ స్థాయిలోనే భారీగా నమోదవుతున్న కేసులు
- 24 శాతం యాంగ్జైటీ ఫోబియా బాధితులే
- బుద్ధిమాంద్యం కేసులు 'అనంత' జిల్లాలోనే ఎక్కువ
- స్కిజోఫ్రీనియా, యాంగ్జైటీతో చాలామంది సతమతం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రకరకాల మానసిక జబ్బుల బాధితుల వివరాలు

జబ్బు	కేసుల శాతం
స్కిజోఫ్రీనియా	19.93
మూడ్ డిజార్డర్స్	26.28
సబ్‌స్టాన్స్ యూజ్ డిజార్డర్స్	15.46
ఆర్గానిక్ అండ్ డిమెన్షియా	9.82
యాంగ్జైటీ ఫోబిక్	24.53
మెంటల్ రిట్రాడియేషన్	3.98

- ఈ నెల 11న అనంతపురంలోని ఓ ప్రైవేట్ మానసిక వైద్యుడి వద్దకు వెళ్లిన ఓ మహిళకు ఉదయం 10.30 గంటలకే 67వ నంబరు టోకన్ వచ్చింది. దీన్ని బట్టి అక్కడ రోజువారీ వందమందికి పైగా ఓపీకి వస్తున్నట్లు తేలింది.
- అనంతపురం సర్వజన ఆస్పత్రిలో రోజూ 200 మంది దాకా మానసిక రోగులు ఔట్‌పేషెంట్ విభాగంలో చికిత్స పొందుతున్నారు. ఈ లెక్కన నెలకు సగటున 5వేల మంది దాకా రోగులు వస్తున్నట్లు తెలుస్తోంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్) జోడెద్దులా పల్లెల్లో సవారీ చేస్తుండగా.. ఇప్పుడు మానసిక రుగ్మతలూ వెంటాడుతున్నాయి. నిన్నా మొన్నటిదాకా పట్టణాలు, నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ పోకడ తాజాగా గ్రామీణ ప్రాంతాలకూ తాకడం ప్రమాదకర సంకేతాలు ఇస్తున్నట్టే అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి కాలంలో మానసిక ఇబ్బందులతో వస్తున్న వారు ఎక్కువయ్యారని జిల్లా మెంటల్ హెల్త్ ప్రోగ్రాం స్క్రీనింగ్ పరీక్షల్లో తేలింది. ఈ పరీక్షల్లో రకరకాల మానసిక రుగ్మతలతో ఇబ్బంది పడుతున్న వారు వేలాదిమంది ఉన్నట్టు బయటపడింది. స్కిజోఫ్రీనియా, డిప్రెషన్, మూడ్ డిజార్డర్స్ వంటి మానసిక జబ్బులతో సతమతమవుతున్నారు. సగటున చూస్తే పురుషుల్లోనే ఎక్కువ మంది బాధితులున్నట్టు వెల్లడైంది.

స్కిజోఫ్రీనియా..యాంగ్జైటీలే ఎక్కువగా..

స్కిజోఫ్రీనియా (మనో వైకల్యం), యాంగ్జైటీ (ఆందోళన) ఎక్కువ మందిలో ఉన్నాయి. ప్రతి దానికీ డీలా పడిపోవడం, ఏమవుతుందోనని భయం, ఆందోళన వంటి జబ్బులతో సతమతమవుతున్నారు. వైద్యుల వద్దకు చికిత్సకు వెళ్లాలంటే కూడా ఆత్మన్యూనతగా భావిస్తున్నారు. ఇలాంటి మానసిక వ్యాధులు దీర్ఘకాలికంగా ఉండటంతో వృత్తిపరంగానూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వెళ్లినప్పుడు బాధితుల జబ్బు తీవ్రత చూసి వైద్యులు ఆశ్చర్యపోతున్నారు. చిన్నారుల్లో వచ్చే బుద్ధిమాంద్యం కేసులు మిగతా జిల్లాలతో పోలిస్తే 'అనంత'లో ఎక్కువని తేలింది.

మానసిక రుగ్మతలకు ప్రధాన కారణాలు

- ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్నకుటుంబాలు రావడంతో వేధిస్తున్న ఒంటరితనం.
- ఆరు సంవత్సరాల వయసునుంచే సామాజిక మాధ్యమాల ప్రభావం ఎక్కువగా ఉండటం.
- మద్యం, ఇతర మత్తుపదార్థాల వినియోగంతో యువకుల్లో మానసిక రుగ్మతలు పెరగడం.
- ప్రైవేటు లేదా కార్పొరేట్ విద్యాసంస్థల్లో విపరీతమైన ఒత్తిడి.
- సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్ వంటి ఉద్యోగాల్లో పని ఒత్తిడి పెరగడం.
- వ్యాయామం లేకపోవడం వల్ల చిన్న వయసులోనే జీవనశైలి జబ్బులకు గురవడం.
- ఇటీవలి కాలంలో స్మార్ట్ ఫోన్‌ల ప్రభావంతో చిన్నారుల్లో మానసిక ఎదుగుదల సరిగా లేకపోవడం.

'ఆరోగ్య సురక్ష' క్యాంపుల్లో రుగ్మతలు వెలుగులోకి..

మండలాల వారీగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంపుల్లోనూ మానసిక రుగ్మతలను వెలికి తీస్తున్నారు. జిల్లాలో వేలాదిమంది ఈ క్యాంపులకు వచ్చి తమ ఇబ్బందులను స్పెషలిస్టు వైద్యులకు తెలిపి చికిత్స చేయించుకుంటున్నారు. ఇలా మానసిక జబ్బులతో వస్తున్న వారిని అనంతపురంలోని సర్వజనాస్పత్రికి రెఫరల్‌గా పంపిస్తున్నారు.

పల్లెల్లోనూ మానసిక రుగ్మతలు



గతంతో పోల్చితే పల్లెల్లోనూ మానసిక రుగ్మతలు పెరిగాయి. ఆహార అలవాట్లు మారాయి. వ్యాయామం లేదు. రకరకాల మానసిక సమస్యలు పెరిగాయి. వీటిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నియంత్రించవచ్చు. చాలా మంది తమకు మానసిక సమస్య ఉందని తెలిసీ చికిత్సకు రావడం లేదు. ఎవరికైనా మానసిక సమస్య ఉన్నప్పుడు పీహెచ్‌సీలకు రావాలి. వైద్యులను సంప్రదించాలి.

–డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్య నిపుణులు, జిల్లా మెంటల్‌హెల్త్ ప్రోగ్రాం

క్రీడల్లో జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురండి



టేబుల్ టెన్నిస్ పోటీలో తలపడిన క్రీడాకారులు

అనంతపురం: క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరుప్రతిష్టలు తీసుకురావాలని కలెక్టర్ గౌతమి క్రీడాకారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో ఏపీ స్టేట్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్–2023 పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ వరకు అండర్–11, 13, 15, 17, 19 విభాగాల్లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని 11 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్రికెట్, హాకీతో పాటు పుట్‌బాల్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికలు గణనీయంగా ప్రాతినిధ్యం వహిస్తుండటం సంతోషదాయకమన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో బాలికలు రాణిస్తూ ఇతరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని కొనియాడారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' సద్వినియోగం చేసుకోండి

డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకు 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం కింద క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 17 సంవత్సరాలు దాటిన క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. జిల్లా నుంచి క్రీడాకారులు దేశ విదేశాల్లో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఆరోగ్యకరమైన పోటీలు చాలా ముఖ్యమన్నారు. అనంతరం ముఖ్య అతిథి కలెక్టర్‌ను డాక్టర్ అక్బర్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బి.మురళీధర్, సెక్రటరీ కేశవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాసరెడ్డి, చీఫ్ రెఫరీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని చాటిన 'నేలతల్లికి వందనం'




అమృత్ కలశాన్ని అందుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేసిన అధికారులు
- మట్టికలశాలతో పట్టణంలో భారీ ర్యాలీ

పుట్టపర్తి అర్బన్: ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తి ఉప్పొంగింది. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరులకు ప్రతి హృదయమూ నివాళులర్పించింది. 'నా మట్టి నాదేశం' అంటూ పట్టణం ప్రతిధ్వనించింది. అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించిన 'నా మట్టి...నా దేశం' కార్యక్రమం దేశభక్తిని చాటింది. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టి కళశాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పలు శాఖల అధికారులు విద్యాగిరి ఆర్చ్ నుంచి కలెక్టరేట్ వరకూ దేశ నాయకుల చిత్రపటాలు, త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు విచ్చేసిన ర్యాలీకి కలెక్టర్ అరుణ్‌బాబు, ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, డీఈఓ మీనాక్షి తదితరులు స్వాగతం పలికారు. ఆ తర్వాత నేలతల్లికి వందనం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల స్మారకార్థం దేశంలోని లక్షలాది గ్రామాల్లో శాసనాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా 'అమృత్ కలశ యాత్ర'లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మట్టిని కలశాల్లో నింపి ఢిల్లీకి పంపుతామన్నారు. అమృత్ కలశ యాత్రలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించేందుకు 'నా మట్టి నా దేశం', 'నేలతల్లికి వందనం' పేరిట ఎన్నో కార్యక్రమాలను రూపొందించినట్లు చెప్పారు. డీఈఓ మీనాక్షి మాట్లాడుతూ.. గత 15వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి ఆయా పాఠశాలల విద్యార్థులు మట్టిని సేకరించి మండల విద్యాధికారుల ద్వారా జిల్లా కేంద్రానికి పంపారన్నారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంఓ అబ్దుల్ మాలిక్, ఏఎంఓ మహేంద్రరెడ్డి, ఆనంద్ బాబు, ఎంఈఓలు ఖాదర్‌వలి, ప్రసాద్ ఉన్నారు.

నాసిన్.. పనులు మెరిసెన్!

- 500 ఎకరాల్లో రూ. 541.62 కోట్లతో పనులు
- అత్యాధునిక సౌకర్యాలతో భవనాలు, అధునాతన రోడ్లు
- శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు
- 2024 మే నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక
- త్వరలో పాలసముద్రానికి క్యూకట్టనున్న ప్రపంచ దేశాలు



పాలసముద్రం వద్ద నిర్మిస్తున్న నాసిన్ అకాడమీ ప్రధాన ద్వారం

పెనుకొండ: నూతన జిల్లా శ్రీసత్యసాయి మకుటంలో మరో మణిహారం తళుక్కున మెరవనుంది. పెనుకొండ నియోజకవర్గం గోరంట్ల మండలం పాలసముద్రం పేరు అంతర్జాతీయంగా వినిపించనుంది. యూనియన్ పబ్లిక్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా ఐఆర్‌ఎస్‌కు ఎంపికయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇచ్చే 'నాసిన్' (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్ డైరెక్ట్ ట్యాక్సస్ అండ్ నార్కోటిక్స్) అకాడమీ నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. గత టీడీపీ హయాంలో కేవలం భూసేకరణతోనే పనులు ఆగిపోగా, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరాక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి పలుసార్లు అకాడమీకి వచ్చి వరుస సమావేశాలు నిర్వహించారు. 'నాసిన్' తుది రూపునకు చర్యలు చేపట్టారు.

2017లోనే నాసిన్ ఏర్పాటుకు అనుమతి..

బెంగళూరుకు అతి సమీపంలో ఉన్న పాలసముద్రం వద్ద 'నాసిన్' నిర్మాణానికి 2017లోనే కేంద్రం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం పేటకుంట, గోరంట్ల, సోమందేపల్లి మండలాలకు చెందిన రైతుల భూములను సేకరించారు. వెంటనే నిర్మాణాలు చేపట్టాలని కేంద్రం ప్రయత్నించినా... అప్పటి టీడీపీ ప్రభుత్వం తగిన సహకారం అందించకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో అకాడమీ నిర్మాణంపై సందేహాలు నెలకొన్నాయి.

2024 మే నాటికి పూర్తి చేసేలా పనులు..

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే 'నాసిన్' నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి తగిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దీంతో 2022 మార్చి 4వ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పాలసముద్రానికి విచ్చేసి అకాడమీకి భూమి పూజ చేశారు. ప్రస్తుతం 500 ఎకరాల్లో రూ. 541.62 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో భవనాలు నిర్మించారు. అత్యాధునిక రోడ్లు వేశారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నాసిన్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఏదిఏమైనా 2024 మే నెలాఖరు నాటికి 'నాసిన్' పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అనంతరం దేశ ప్రధాని చేతుల మీదుగా అకాడమీని ప్రారంభించేలా కేంద్రం ప్రణాళిక సిద్ధం చేసింది. దేశంలోనే పేరుగాంచిన హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పోలీస్ అకాడమీకి దీటుగా 'నాసిన్' అకాడమీని తీర్చిదిద్దుతున్నారు.

ఐఆర్‌ఎస్‌కు ఎంపికైన వారికి శిక్షణ..

యూపీఎస్సీ ద్వారా ఐఆర్‌ఎస్‌కు ఎంపికైన అభ్యర్థులకు నాసిన్ అకాడమీలో శిక్షణ ఇస్తారు. నకిలీ కరెన్సీకి ముకుతాడు వేయడం, మాదక ద్రవ్యాల నియంత్రణ, స్మగ్లింగ్ లాంటివి అరికట్టడంపై ఇక్కడ శిక్షణ ఇస్తారు. అలాగే పరోక్ష పన్నుల గురించి అభ్యర్థులకు అవగాహన కల్పిస్తారు. అలాగే ఇతర దేశాలకు చెందిన వారు సైతం అకాడమీలో శిక్షణలు తీసుకుంటారని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం హిందూపురం మీదుగా పాలసముద్రానికి ప్రత్యేక రైల్వే లైన్ వేసింది.


సర్కార్ ప్రత్యేక చర్యలు



నాసిన్ అకాడమీ నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అకాడమీ ప్రారంభమైతే పాలసముద్రం అత్యంత విలువైన ప్రాంతంగా మారనుంది. దేశ విదేశాల నుంచి ప్రముఖులు తరచూ ఇక్కడి వస్తారు. తద్వారా రాకపోకలు భారీగా పెరుగుతాయి.

– గోవిందరెడ్డి, పాలసముద్రం

ప్రపంచ ఖ్యాతి




నాసిన్ అకాడమీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అధునాతన సౌకర్యాలతో భవనాలు, రోడ్లు నిర్మించారు. నాసిన్ కార్యకలాపాలు ప్రారంభమైతే పాలసముద్రానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

– గంగప్ప, సర్పంచ్, పాలసముద్రం

సెంట్రల్ వర్సిటీలో పనులు చేపట్టండి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



కేంద్రీయ విశ్వవిద్యాలయం మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: కేంద్రీయ విశ్వవిద్యాలయం (సెంట్రల్ యూనివర్సిటీ)లో అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల అంశంపై కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. విశ్వవిద్యాలయ మ్యాప్‌ను పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన పనుల వివరాలు, ఇప్పటి వరకు తీసుకున్న చర్యల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రహరీ నిర్మాణం సగంలోనే ఎందుకు నిలిచిపోయిందో కారణాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించుకుని మిగిలిన పనులు రెండు రోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. యూనివర్సిటీలో 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

రెండు వరుసల రహదారి నిర్మించాలి..

అనంతపురం– తాడిపత్రి హైవే నుంచి కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రెండు వరుసల రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నాయో అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదించాలన్నారు. భవనాల నిర్మాణం సకాలంలో పూర్తికావాలన్నారు. నీటి సరఫరా పనులు చేపట్టాలన్నారు. రాబోయే విద్యాసంవత్సరానికి విశ్వవిద్యాలయంలో తరగతులు ప్రారంభించే లక్ష్యంగా పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ మధుసూదన్, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ హనుమాన్ కెనడి, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, హెచ్‌ఎల్‌సీ ఎస్‌ఈ రాజశేఖర్ సీపీడబ్ల్యూడీ ఈఈ శ్రీనివాస్, ఏపీఎస్‌సీఆర్‌ఐసీ ఈఈ ప్రభాకర్‌రెడడి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైల్వే ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి..

రైల్వే ప్రాజెక్టుల పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి అధికారులను ఆదేశించారు. రైల్వే ప్రాజెక్టుల లెవల్ క్రాసింగ్‌ల భూ సేకరణ అంశంపై కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్డీఓలు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 17 రకాల రైల్వే ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. ఇందులో ధర్మవరం– పాకాల సెక్షన్ పరిధిలో గొల్లపల్లి వద్ద, గుత్తి–ధర్మవరం సెక్షన్‌లోని ప్రసన్నాయపల్లి, పామిడి, సోములదొడ్డి, తాటిచెర్ల, గార్లదిన్నె, కందుకూరు, గజరాంపల్లి, రామరాజులపల్లి వద్ద ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అలాగే కల్లూరు– గుంతకల్లు సెక్షన్‌లో గుంతకల్లు వద్ద, రేణిగుంట– గుత్తి సెక్షన్ పరిధిలో తాడిపత్రి ఆటోనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు వచ్చాయని వెల్లడించారు. ప్రతిపాదనలు వచ్చిన ప్రాంతాల్లో భూ సేకరణ వేగవంతం చేయాలని ఆదేశించారు. జాప్యానికి తావివ్వకుండా మంజూరు, సర్వే, పెగ్ మార్కింగ్ ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే శాఖకు అన్ని శాఖల అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీఓలు మధుసూదన్, రవీంద్ర, నిషాంత్‌డ్డి, రైల్వే శాఖ డీఈ రమణరావు, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ కరుణాకర్, కలెక్టరేట్ భూపరిపాలన విభాగం సూపరింటెండెంట్ బాలాజీ, డీటీ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుల భద్రతే ముఖ్యం

- ఆర్‌పీఎఫ్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్



ధర్మవరంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్‌పీఎఫ్ సౌత్ సెంట్రల్ ఐజీ అరోమా సింగ్ ఠాకూర్

అనంతపురం సిటీ/ధర్మవరం రూరల్: రైల్వే ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) ఐజీ అరోమా సింగ్ ఠాకూర్ తెలిపారు. అనంతపురం, ధర్మవరం రైల్వే స్టేషన్లలోని ఆర్‌పీఎఫ్ స్టేషన్లను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం సమీక్షించారు. పాత కేసుల గురించి ఆరా తీశారు. రైళ్లకు ఎస్కార్ట్‌గా వెళ్లే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. రైళ్లల్లో దోపిడీలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పాత నేరస్తులపై ఓ కన్నేసి ఉంచాలని పేర్కొన్నారు. రైల్వే స్టేషన్లు, పరిసరాల్లో విద్రోహ శక్తుల కదలికలపై నిఘా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా మహిళా ప్రయాణికుల మాన, ప్రాణాలకు పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆర్‌పీఎఫ్ సిబ్బందిదేనని స్పష్టం చేశారు. నిషేధిత పదార్థాలు సరఫరా కాకుండా చూడాలన్నారు. జీఆర్‌పీ సిబ్బంది సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం అనంతపురం, ధర్మవరం ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్ ఆవరణల్లో మొక్కలు నాటారు. ఆమె వెంట గుంతకల్లు డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ, సహాయ కమిషనర్ విశ్వనాథ్ మిశ్రా, ఆర్పీఎఫ్ అనంతకపురం ఎస్‌ఐ మధుకర్‌చారి, ఏఎస్‌ఐ ఎస్‌ఎండీ రఫీ ఉన్నారు.

క్లుప్తంగా

టపాసుల విక్రయానికి దరఖాస్తుల ఆహ్వానం



పుట్టపర్తి అర్బన్: దీపావళి పండుగ నేపథ్యంలో టపాసుల విక్రయ లైసెన్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ లోపు అన్ని పనిదినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పూర్తిచేసిన మూడు సెట్ల దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయంలో అందజేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల విచారణ అనంతరం అర్హతను బట్టి జీఎస్టీ, ఫైర్ చలానా, ఎన్‌ఓసీ సమర్పించిన వారికి లైసెన్సులు అందజేయనున్నట్లు చెప్పారు. గతంలోని లైసెన్సులు చెల్లుబాటు కావన్నారు. ఈ ఏడాది దరఖాస్తు చేసుకొని లైసెన్సు పొందినవారే టపాకాయల విక్రయానికి అర్హులన్నారు. www.peso.gov.inలో లభ్యమయ్యే ఫారం ఏఈ–5 తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం దరఖాస్తుతో పాటు నివాస ధ్రువీకరణ పత్రం, 5 పాస్‌ఫోట్ సైజ్ ఫొటోలు, రూ.500 చలానా చెల్లించాలన్నారు. చలానాలు సిటిజన్ సర్వీసెస్– ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్–హెడ్ ఆఫ్ అకౌంట్స్ డీటీఏఓ పుట్టపర్తి, జిల్లా కలెక్టర్, పుట్టపర్తి పేరుపై డీడీ రూ .500 తీయాలన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ బంగారం విక్రేతలు


చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్ పోస్ట్ సమీపంలో ముగ్గురు నకిలీ బంగారం విక్రేతలను చిలమత్తూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నకిలీ బంగారం తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎస్‌ఐ గంగాధర్, సిబ్బంది కలసి వాహనాలు తనిఖీ చేపట్టగా ఓ బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సుమారు 4 కేజీల వరకూ ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే పోలీసులు ఈ విషయంపై వివరాలు చెప్పేందుకు నిరాకరించారు. విచారణ దశలో ఉన్నందున వివరాలు వెల్లడించలేమని ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

చీటీల మాటున చీటింగ్!

- హిందూపురం పట్టణంలోని మేళాపురానికి చెందిన కొందరు మహిళా సంఘం పేరుతో డబ్బు పొదుపు చేసుకొని వారిలో వారే చీటీల రూపంలో పాడుకున్నారు. చివరకు వారిలో విభేదాలు రావడంతో చీటీలు ఎత్తిన వారు తిరిగి చెల్లించలేదు. చీటీలు కట్టిన వారు నిర్వాహకులను డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో ఇటీవల ఈ పంచాయతీ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లింది.
- పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన స్నేహితులు, బంధువులతో చీటీల పేరుతో డబ్బులు కట్టించుకున్నాడు. చీటీ చివరి స్టేజీకు వచ్చే సరికి సెల్ స్విచ్చాఫ్ చేసుకున్నాడు. అతను మరోచోట రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడిపెట్టి నష్టపోవడంతో బెంగళూరుకు చెక్కేసినట్లు గుర్తించారు. బాధితులు మాత్రం డబ్బులు పోయాయంటూ లబోదిబోమంటున్నారు.

హిందూపురం పట్టణంలోని చిన్నమార్కెట్‌కు చెందిన ఓ మహిళ స్థానికంగా ఉన్న వారితో పరిచయం పెంచుకుంది. ఈ నేపథ్యంలోనే చీటీ పేరుతో 20 మందితో నెలకు రూ.10 వేల చొప్పున కట్టించుకొంది. ఇలా నెలలో రెండు, మూడు చీటీలు నడుపుతూ ముందు డబ్బులు కూడా బాగానే ఇచ్చింది. నమ్మకం ఏర్పడిన తరువాత మళ్లీ ఆమె వద్దే చీటీలు వేసే వారిని చివరిలో సతాయించడం మొదలు పెట్టింది. చీటీలు వేసిన వారు డబ్బులు డిమాండ్ చేయడంతో రేపు, మాపు అంటూ దాటేస్తూ వస్తోంది. చీటీలు కట్టిన వారు ఇప్పులు డబ్బులు వసూలు చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

- జిల్లాలో జోరుగా చీటీల నిర్వహణ
- అనుమతి ఉన్నవి 64.. అనధికారికంగా 2 వేలపైనే ...
- మోసం చేస్తే చర్యలు తప్పవంటున్న పోలీసులు



చీటీదారుకు ఇచ్చిన రసీదు

హిందూపురం అర్బన్: చీటీల పేరుతో మోసాలు పెరిగిపోతున్నాయి. ముందు బాగా నమ్మకంగా ఉండి తర్వాత మోసం చేస్తుండటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా హిందూపురం పట్టణంలో ఇలాంటి కేసులు పెరిగిపోతున్నాయి. ఏడాది క్రితం పట్టణంలో ఏకంగా ఓ మహిళ చీటీలు, ఫైనాన్స్ పేరుతో చిన్నమార్కెట్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని పట్టణంలోనే కాకుండా చుట్టు పక్కల మండలాల్లో కూడా అధిక వడ్డీ ఆశ చూపి రూ.25 కోట్ల వరకు వసూలు చేసింది. డబ్బు జమ అయ్యాక రాత్రికి రాత్రే పరారైంది. బాధితులు వందల్లో ఉన్నట్లు తేలింది. ఇప్పటికీ అక్కడ డిపాజిట్ రూపంలో డబ్బు కట్టిన వారు కోలుకోలేకపోతున్నారు. పోలీసులు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతోంది.

అనధికారికంగానే ఎక్కువ..

హిందూపురం పట్టణంతో పాటు మడకశిర, లేపాక్షి, పరిగి, గోరంట్ల, చిలమత్తూరు కేంద్రాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా చీటీలు నడుపుతున్న వారు వందల్లో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 64 చిట్ కంపెనీలు ఉన్నాయి. అనధికారికంగా 2 వేలకు పైగా ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్, ప్రభుత్వ, వ్యాపార వర్గాల్లో కొందరు కలిసి గ్రూపుగా ఏర్పడి చీటీలు వేసుకోవడం సాధారణంగా మారింది. కాని చాలా మంది నిర్వాహకులు చీటీలు వేసిన వారిని ఇబ్బందులు పెట్టడం తరచూ చూస్తునే ఉన్నాం.

ప్రధాన చిట్ ఫండ్ కంపెనీల్లోనూ...

పట్టణంలో దాదాపు 15 వరకు ప్రముఖ చిట్ ఫండ్ కంపెనీలు జోరుగా వ్యాపారం చేస్తున్నాయి. అయితే చీటీ పాడిన తరువాత షూరిటీ పేరుతో వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారన్న విమర్శలున్నాయి. రెండు, మూడు నెలలు సమయం తీసుకుండటంతో వారి వద్ద చీటీలు వేసేందుకు ప్రజలు జంకుతున్నారు. ఇలాంటి మోసాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మోసం చేస్తే కఠిన చర్యలు



అనుమతులు లేకుండా చీటీ వ్యాపారం చేయడం నేరం. చీటీల పేరుతో ప్రజలను మోసం చేస్తే ఎవరినైనా ఉపేక్షించం. కంపెనీలు అయినా, వ్యక్తులైన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. పైసా పైసా కూడబెట్టిన డబ్బును తెలియని వారి వద్ద చీటీలు వేసి మోసపోద్దు. పట్టణంలో చీటీలు వేసే వారిపై నిఘా ఉంచుతాం. – కంజాక్షన్, డీఎస్పీ, హిందూపురం

యువకుడి బలవన్మరణం

- 20 రోజుల వ్యవధిలోనే సోదరుల మృత్యువాత



మృతుడు మనోహర్‌రెడ్డి

అమడగూరు: కుటుంబ నిర్వహణకు చేసుకున్న అప్పులు, ఇరవై రోజుల క్రితం సొంత సోదరుడి మృతి, భవిష్యత్తుపై వివిధ రకాల ఆలోచనలతో మనోహర్‌రెడ్డి (33) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.. పంటల సాగు, కుటుంబ నిర్వహణకు మనోహర్‌రెడ్డి రూ. 2 లక్షల దాకా అప్పులు చేశాడు. మృతుని సోదరుడు నవీన్‌కుమార్‌రెడ్డి ఇరవై రోజుల క్రితమే మొలకలచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోదరుడి మృతి మనోహర్‌రెడ్డిని తీవ్రంగా కలచివేసింది. అప్పటి నుంచి ఏదోలా ఉండేవాడని, చేసిన అప్పులెలా తీర్చాలని బాధ పడుతూ ఉండేవాడన్నారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం అమడగూరుకు వెళ్లొస్తానని చెప్పి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. బహిర్భూమికి వెళ్లిన యువకులు గుర్తించి పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ బలరామయ్య, కుటుంబ సభ్యులు ఘటనాస్థలానికి చేరుకుని అపస్మారక స్థితిలో ఉన్న మనోహర్‌రెడ్డిని అమడగూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఉన్న ఇద్దరు కొడుకులూ కళ్ల ముందే చనిపోతే ఎలా స్వామీ, ఇక మాకు దిక్కెవరూ దేవుడా అంటూ మృతుని తల్లి, భార్య, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి కూతురు కూడా ఉంది. నెల తిరగకుండానే ఇంట్లో ఇద్దరి చావుతో శీతిరెడ్డిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రాజవంశీకులకే 'రత్నగిరి' ఆలయ నిర్వహణ బాధ్యతలు



ఎమ్మెల్యే తిప్పేస్వామిని సన్మానిస్తున్న రాజవంశీకుడు రంగప్పరాజు

రొళ్ల: మండల పరిధిలోని చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయ నిర్వహణ బాధ్యతలు తిరిగి రాజ వంశీకులకు కేటాయించినట్లు రత్నగిరి సంస్థానం రాజవంశీకుడు దొర రంగప్పరాజు తెలిపారు. కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయ నిర్వహణ బాధ్యతను దేవదాయశాఖ చేపట్టాలని గత టీడీపీ ప్రభుత్వం హయాంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు లిఖిత పూర్వకంగా రాసి అప్పగించారు. అయితే దేవదాయశాఖ ఆధీనంలోకి ఆలయం వెళ్లినప్పటి నుంచి ఆలయం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. కేవలం బ్రహ్మోత్సవాల సమయంలో హాజరై నిర్వహణ బాధ్యతలు చేపట్టి వెళ్లేవారు. దీని వల్ల ఏమాత్రం ఉపయోగం లేకపోవడంతో తిరిగి యథావిధిగా రాజవంశీకులకు, ఆలయ కమిటీ సభ్యులకు కేటాయించాలని ఆలయ నిర్వహణ బాధ్యతలు ఇవ్వాలని విన్నవించుకోవడంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి తిరిగి తమకు ఆలయ నిర్వహణ బాధ్యతలను అప్పగించిందని దొర రంగప్పరాజు తెలిపారు. ఇందుకు సహకరించిన ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్‌తో పాటు ఎమ్మెల్యే తిప్పేస్వామిని కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

కట్టుకున్నోడే కాలయముడు

- భార్యను కడతేర్చి అనారోగ్యంతో చనిపోయిందని చిత్రీకరణ
- కుమారుడి ఫిర్యాదుతో కటకటాల్లోకి..



మాట్లాడుతున్న డీఎస్పీ బీ శ్రీనివాసులు

రాయదుర్గం: అతను తాగుబోతు..పైగా తిరుగుబోతు.. తాగుడు మాని బుద్ధిగా ఉండాలని చెప్పిన భార్యపై దాడి చేసి అనంత లోకాలకు పంపాడు. పైగా అనారోగ్యంతో చనిపోయిందని అందరినీ నమ్మించాడు. అయితే కుమారుడి ఫిర్యాదుతో అసలు నిజం బయట పడటంతో ఊచలు లెక్కిస్తున్నాడు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం రాయదుర్గంరూరల్ సర్కిల్ కార్యాలయం వద్ద సీఐ యుగంధర్, ఎస్‌ఐ దుగ్గిరెడ్డితో కలసి డీఎస్పీ బీ శ్రీనివాసులు విలేకర్లకు వెల్లడించారు. కణేకల్లు మండలం సొల్లాపురానికి చెందిన మాదల వన్నూర్‌స్వామితో బెళుగుప్ప మండలం శిర్పికి చెందిన మాదల చిట్టెమ్మకు 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. గత నెల 9న మాదల వన్నూర్‌స్వామి, భార్య చిట్టెమ్మ (44) తో గొడవపడి కర్రతో తలపై బాదాడు. ఆమె మృతి చెందింది. అనారోగ్యమే మృతికి కారణమంటూ వన్నూర్‌స్వామి అందరినీ నమ్మించి పాతిపెట్టాడు. పనిపై వెళ్లిన కుమారుడు గత నెల 11న స్వగ్రామానికి వచ్చి తల్లి మృతికి గల కారణాలపై ఆరా తీశాడు. తండ్రిపై అనుమానం వ్యక్తం చేస్తూ అదేరోజు కణేకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కణేకల్లు తహసీల్దార్ సమక్షంలో పాతిపెట్టిన శవాన్ని వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. చిట్టెమ్మ తలకు బలమైన దెబ్బ తగలడంతోనే మృతి చెందినట్టు నిర్ధారణ అయింది. దీంతో నిందితుడిపై ఐపీసీ 302, 201 సెక్షన్ల కింద కేసుగా నమోదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సొల్లాపురం బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్టు చేశామన్నారు. కర్రతో బాదడంతోనే చిట్టెమ్మ చనిపోయినట్లు విచారణలో నిందితుడు ఒప్పుకున్నాడన్నారు.

ఫ్రిడ్జ్ డోరు తీస్తుండగా విద్యుదాఘాతం

- వ్యక్తి మృతితో గంగవరంలో విషాదఛాయలు



బాషా (ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని గంగవరం గ్రామంలోని కోట వీధికి చెందిన బాషా (58) విద్యుదాఘాతంతో మృతి చెందారు. పోలీసుల వివరాలమేరకు... మృతుడు బాషా తన ఇంటిలోని ఫ్రిడ్జ్‌లో పాలను నిల్వ చేశాడు. ఇందులో భాగంగానే శుక్రవారం పాల ప్యాకెట్లు తీద్దామని ఫ్రిడ్జ్ డోర్ తీస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడన్నారు. కాలనీలో హైఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన బాషాను హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య శర్మస్‌బీ, కుమారులు సాధిక్‌వలీ, జబీవుల్లా ఉన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ రామకృష్ణయ్య, విద్యుత్‌శాఖ ఏఈ గంగాధర్‌గుప్తా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని కుమారుడు జబీవుల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా ఉన్న బాషా మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వరరెడ్డి గంగవరం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎంపీటీసీ ప్రసాద్, సర్పంచ్ రోజా, ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, తదితరులు నివాళులర్పించారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు



నేత్రాలను వైద్య బృందానికి అందజేస్తున్న కుటుంబ సభ్యులు

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు శకుంతలమ్మ మరణానంతరం మరో ఇద్దరికి కంటి చూపునిచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున అనారోగ్యంతో ఆమె మరణించారు. విషయం తెలుసుకున్న వైద్యులు ఆమె మృతదేహం నుంచి నేత్రాలను సేకరించి, బెంగళూరులోని డాక్టర్ రాజ్‌కుమార్ ఐ బ్యాంక్‌కు తరలించారు. శకుంతలమ్మ మృతదేహం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మేడికుర్తి హరి, ప్రజాపోరు కన్వీనర్ కేవీ చలపతి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భవనంపై నుంచి కిందపడి తాపీ మేస్త్రీ మృతి



మృతుడు హరిజన మురళి

కనగానపల్లి: ఇంటి నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ భవనం పై నుంచి కిందపడిన తాపీ మేస్త్రీ మృతి చెందిన సంఘటన గుంతపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. గుంతపల్లి ఎస్సీ కాలనీకి చెందిన హరిజన మురళి (32) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన గొల్ల బుజ్జన్న ఇంటి నిర్మాణం చేస్తున్నారు. ఇందులో భాగంగా సారవపైకి ఎక్కి గోడ నిర్మాణం చేస్తుండగా ప్రమాదవశాత్తూ కాలు జారీ కింద పడ్డాడు. సుమారు 15 అడుగుల ఎత్తు నుంచి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య ప్రశాంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన చిన్నారి మృతి

హిందూపురం అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిన్నారి శ్రీఆద్య (8) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరూన్‌బాషా తెలిపారు. పట్టణంలోని రిలయన్స్ బంక్ సమీపంలో గురువారం రాత్రి ఎగ్జిబిషన్‌కు వచ్చి వెళ్తున్న సమయంలో పట్టణంలోని పాండు రంగనగర్‌కు చెందిన తల్లీకూతుళ్లు చైత్ర , శ్రీ ఆద్య వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని బైపాస్ రోడ్డుపై గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. చికిత్స పొందుతూ శ్రీ ఆద్య శుక్రవారం చనిపోయింది. శ్రీ ఆద్య తండ్రి శ్రీరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని త్వరలోనే నిందితుడిని పట్టుకుంటామన్నారు.

ఎస్కేయూ పాలకమండలి సభ్యురాలిగా డాక్టర్ అనిత



అనంతపురం: శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలుగా కెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే అనిత నియమితులయ్యారు. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ జే శ్యామలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 1న వర్సిటీ పాలక మండలిని నియామకం చేస్తూ జీఓ 76ను జారీ చేశారు. అందులో పాలక మండలి సభ్యుల పేర్లలో ఇంటిపేరు తప్పుగా అచ్చయ్యింది. దీంతో జీఓ నంబర్ 76కు సవరణ జీఓ 104ను జారీ చేశారు. కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కే అనిత 2010లో ఉద్యోగంలో చేరారు. పాలక మండలిలో మహిళలకు 50 శాతంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 50 శాతం పైగా స్థానాలను కట్టబెట్టేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తున్నారు.

వేరుశనగ కోత యంత్రం బోల్తా

- నలుగురు మహిళా కూలీలకు గాయాలు

గుత్తిరూరల్: మండంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో శుక్రవారం వేరుశనగ కోత యంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు మహిళా కూలీలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాలమేరకు.. కరిడికొండ గ్రామానికి చెందిన మహలక్ష్మీ, లక్ష్మీదేవీ, వరలక్ష్మీ, ఊబిచెర్లకు చెందిన లక్ష్మీదేవీతో పాటు మరో ఇద్దరు ఊబిచెర్ల గ్రామ శివారులో పంట పొలాల్లో వేరశనగ కోతకు వెళ్లారు. ఓ రైతు పొలంలో వేరుశనగ కట్ట తొలగించిన అనంతరం మరో పొలంలోకి వెళ్తుండగా కోత యంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో మహలక్ష్మీ, వరలక్ష్మీ, లక్ష్మీదేవీ, శ్రీలక్ష్మీదేవీలకు తీవ్రగాయాలయ్యాయి, గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు వారిని కర్నూలు, అనంతపురంకు తరలించారు.

ఎంటెక్, ఎంసీఏ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో అక్టోబర్ –2023లో నిర్వహించిన ఎంటెక్ రెండో సెమిస్టర్ , ఎంసీఏ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ శుక్రవారం విడుదల చేశారు. ఫలితాలు తెలుసుకోవడానికి జేఎన్‌టీయూ అనంతపురం కళాశాల అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ. అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి. విష్ణువర్ధన్, డి. లలిత కుమారి, పాలక మండలి సభ్యుడు ఎం. రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర సదస్సు

అనంతపురం అర్బన్: పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర సదస్సు ఈనెల 19న తాడిపత్రిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా కొన్నేళ్లగా ఉద్యాన పంటలు దెబ్బతింటున్నాయన్నారు. దీంతో పండ్ల తోటల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న సాగు ఖర్చులు తగ్గించి, ఆత్మహత్యల నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సదస్సులో వివిధ అంశాలుపై చర్చించి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సు జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజారామిరెడ్డి, బీహెచ్‌రాయుడు, పోతులయ్య పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

అనంతపురం క్రైం: అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై బాధితురాలు శుక్రవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ధరణీ కిషోర్ తెలిపిన వివరాలమేరకు.. స్థానిక రంగస్వామినగర్‌కు చెందిన బెడదూరి నర్మదను శింగనమల మండలం ఉల్లికల్లుకు చెందిన అజ్జుగుట్ట నరేంద్రకు ఇచ్చి 2019లో వివాహం జరిపించారు. కొంతకాలం వారి బంధం సాఫీగా సాగింది. అయితే భర్తకు డబ్బు మీదున్న అత్యాశతో భార్యను వేధించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీలు కూడా జరిగాయి. మార్పురాక పోగా వేధింపులు అధికం కావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. భారీగా కట్న కానుకలు ఇచ్చినా తనకు వచ్చిన జీతాన్ని కూడా తీసేసుకుని కనీసం చేతిఖర్చులకు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని నర్మద పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టరు సీజ్..

బుక్కరాయసముద్రం నీలంపల్లి గ్రామంలోని వంకలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నరహరి ఈశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ ధరణీకిషోర్ తెలిపారు. ఈ మేరకు ట్రాక్టరును సీజ్ చేశామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

అనంతపురం క్రైం: స్థానిక వన్‌టౌన్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేశారు. ఈ దాడుల్లో కమలానగర్ ఎస్‌ఆర్‌ఎస్ లాడ్జిలో పేకాట ఆడుతున్న 8 మందిని, సమీపంలోని మెకానిక్ షెడ్‌లో పేకాట ఆడుతున్న మరో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 54 వేల నగదుని స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలని సీఐ రెడ్డెప్ప ప్రజలను కోరారు.

రైఫిల్ షూటింగ్, ఖోఖో జట్ల ఎంపిక



రైఫిల్ షూటింగ్‌కు ఎంపికైన క్రీడాకారులు



ఖోఖో జట్టు సభ్యులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా అండర్–17, అండర్–14 బాల, బాలికల రైఫిల్ షూటింగ్, ఖోఖో జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. అనంతపురంలోని ఆర్యన్ అకాడమీలో రైఫిల్ షూటింగ్, న్యూటౌన్ జూనియర్ కళాశాలలో ఖోఖో పోటీలు జరిగాయి. రైఫిల్ షూటింగ్ పోటీలు అనంతపురం జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ బి.సుగుణమ్మ, శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ అంజన్న, ఎస్‌జీఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఎల్. నాగరాజు, శ్రీ సత్యసాయి జిల్లా కోఆర్డినేటర్ డి. మొరార్జీ యాదవ్ ఆధ్వర్యంలో జరిగాయి. రాష్ట్ర స్థాయి పోటీలు త్వరలో తూర్పుగోదావరి జిల్లాలో జరగనున్నాయి.

రైఫిల్ షూటింగ్ ఎంపికైన వారు..

ప్రవల్లిక, అన్విత, కావ్య, దీవెన, పటాన్, సుహాన్, సువర్ణ, ఉద్యుతి, సమంత, రజిత, తేజస్విని, సుహా, శృతి, డి.రోహిత్ యాదవ్, అఖిల్, అజయ్, భానుప్రకాష్‌రెడ్డి, మహేష్ , శశాంక్.

ఖోఖోకు ఎంపిక వారు..

స్వప్న, సంధ్య, సోహిక, సునీత, మౌనిక, రాజ్యలక్ష్మి, మానస, జయశాలిని, లతిక, భవ్యశ్రీ, హేమలత, ఐశ్వర్య.